క్లుప్తంగా

దారి వివాదం.. ఘర్షణ

పుంగనూరు: మండలంలోని ఒంటిమిట్ట గ్రామం నుంచి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లే దారి విషయమై ఏర్పడిన వివాదం ఇరువర్గాల ఘర్షణకు దారితీసింది. ఒంటిమిట్టకు చెందిన వెంకటప్ప, మోహన్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న దారిలో ఏర్పాటుచేసిన ముళ్ల కంచెకు నిప్పు పెట్టారు. ఈ వివాదం పెద్దదై ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. దీంతో మోహన్, గౌతమి గాయపడ్డారు. వారిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామదేవత బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా నిర్మించిన ఆలయంలో సోమవారం గ్రామ దేవత బోయకొండ గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ భూతబలి, అభిషేకం, సర్వదర్శనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో పుంగనూరుకు ట్రోఫీ



విజేతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు: బెంగళూరు పట్టణంలో నిర్వహించిన రోటరీ బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో పుంగనూరు క్రీడాకారులు అనిల్, మునిరాజ ట్రోఫీ అందుకున్నట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నానబాల గణేష్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీధర్ ప్రారంభించారు. విజేతలకు గవర్నర్ ఎలిజిబెత్ చరియాన్ బహుమతులు అందజేశారు. లీగ్ మ్యాచుల్లో వివిధ జోన్ల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కల్లూరు సీఐగా జయరామయ్య



పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం కల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా ఎం.జయరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సూర్యనారాయణ చిత్తూరుకు బదిలీ అయ్యారు. జయరామయ్య మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నేరాలు అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

వరిలో కలుపు మొక్కల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌వైఎస్ఎస్ మేనేజర్ వాసు

గంగవరం: స్థానిక ఐకేపీ సమావేశ మందిరంలో సోమవారం వరిలో కలుపు మొక్కల నియంత్రణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ వరిలో నీటిని ఎక్కువగా పెట్టకూడదన్నారు. నాట్లు వేసిన మూడు వారాల వరకు నీటిని పొలంలో ఉంచాలన్నారు. ఆ విధంగా చేయడం వలన కలుపు మొక్కలను పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. నవ పప్పుధాన్యాలు, తీగ జాతి రకాలు సాగు చేస్తే భూసారం పెంపొందించడంతో పాటు అధిక దిగుబడిని పొందవచ్చని సూచించారు. ఏవో రఖీబా, ఏపీఎం మీరాభాయి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లప్పకొండ ఆలయ గోపురానికి భూమి పూజ



మల్లప్ప కొండపై భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లె గ్రామ సమీపంలో మల్లప్పకొండపై వెలసిన శ్రీ స్వర్ణగిరి మల్లేశ్వరస్వామి ఆలయ గోపురం నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజగోపురం నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మల్లప్ప కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు టీఎం బాబునాయుడు, చంద్రశేఖర్, ఆలయ చైర్మన్ రాజగోపాల్, సంగనపల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా మారిన పందిళ్లపల్లె పంచాయతీకు చెందిన చెత్తసేకరణ కేంద్రం



చెత్తలేక ఖాళీగా వున్న వర్మీకంపోస్టు పిట్ తొట్టెలు

కనిపించని చెత్త సేకరణ



చౌడేపల్లెలో మండలం పరికిదొనలో నిరుపయోగంగా వున్న చెత్త సంపద కేంద్రం

- నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు
- మందుబాబులకు నిలయాలుగా మారిన వైనం
- కేంద్రాల వైపు కన్నెత్తి చూడని కార్మికులు
- పట్టించుకోని అధికారులు

చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలు అదనపు ఆదాయం పొందాలనే ఉద్దేశంతో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటుచేశారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రూ.లక్షల ప్రజాధనం వృథాగా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చౌడేపల్లె: గ్రామాల్లో వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువులను తయారుచేయాలనే ఉద్దేశంతో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటుచేశారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలుండగా కొండయ్యగారిపల్లె, ఆమినిగుంట మినహా మిగిలిన పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక్కొక్క కేంద్రం నిర్మాణానికి రూ.5 లక్షల వరకు ఖర్చుచేశారు. వీటితోపాటు 10 నాటెప్ కంపోస్టు పిట్ల నిర్మాణం చేపట్టారు. చౌడేపల్లెలో సుమారు రూ.15 లక్షలతో నాటెప్ కంపోస్టు పిట్లను నిర్మించారు. గ్రామాల్లో చెత్తను సేకరించేందుకుగాను 32 మంది కార్మికులను (గ్రీన్ అంబాసిడర్లు) నియమించారు. వారికి ప్రతినెలా రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలి. అక్కడ బాటిళ్లు, ఇతర వస్తువులను వేరుచేసి కంపోస్టు పిట్లలో చెత్తను వేసి వాటి వర్మీకంపోస్టు తయారు చేయాలి. దాన్ని రైతులకు విక్రయించాలి. ఎక్కడా ఈ పనులు జరగడం లేదు. కార్మికులు గ్రామాల్లో చెత్తను సేకరించలేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు పశువులు, మందుబాబులు, అసాంఘిక నిలయాలుగా మారాయి. ఇకనైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్లతో పారిశుద్ధ్య పనులు

మండలంలోని చెత్తసేకరణ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు నియమించిన గ్రీన్ అంబాసిడర్లను అధికారులు కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసే పనులను వినియోగించుకుంటున్నారు. చౌడేపల్లెలోని చెడుగుట్లపల్లె రోడ్డులో ఏర్పాటుచేసిన ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాన్ని అరకొరగా వినియోగిస్తున్నారు. మరెక్కడా వినియోగించడంలేదు. గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. నీరు కలుషితం అవుతోంది.

పంపిణీకి నోచుకోని చెత్తబుట్టలు

ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయడానికి గత ప్రభుత్వం మండలానికి సుమారు 18 వేల చెత్త బుట్టలు అందజేసింది. ఎన్నికల కోడ్ రావడంతో వాటిని పంపిణీ చేయకుండా సచివాలయాల్లోనే ఉంచారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో పంపిణీకి నోచుకోలేదు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

మండలంలోని చెత్త సంపద కేంద్రాలను వారం రోజుల్లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తాం. చెత్త బుట్టలను కూడా వెంటనే పంపిణీ చేసేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. ప్రజలకు అవగాహన కల్పించి ఇంటింటికీ వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు చెత్త అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

–లీలామాధవి, ఎంపీడీవో, చౌడేపల్లె

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఈవోకు నగదు అందజేస్తున్న దాతలు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయ రాజగోపుర నిర్మాణానికి పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ సరోజిని రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం ఆలయ ఈవో కమలాకర్‌కు నగదు అందజేశారు. అదే విధంగా వెంకటేశ్వర్లు, క్రిష్ణవేణి చెరో రూ.5,116లను అందజేశారు. దాతల విరాళాలతో ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నట్టు ఈవో తెలిపారు.

సీహెచ్‌సీకి వైద్య పరికరాలు



పరికరాలను చూపుతున్న డాక్టర్ ప్రసాద్‌రాజు

సదుం: స్థానిక సీహెచ్‌సీకి నూతన వైద్య పరికరాలు వచ్చినట్లు వైద్యాధికారి డాక్టరు ప్రసాదరాజు సోమవారం తెలిపారు. కంటి పరీక్షల కోసం ఆటో రిఫ్లెక్టరు మీటరు, గ్లాకోమా పరీక్ష యంత్రాలతో పాటు డిజిటల్ ఎక్స్‌రే మిషన్ వచ్చాయన్నారు. వీటి ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీర్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టరు షఫీ, హెడ్‌నర్స్ అముద, నరసింహులు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫోన్లు మాకొద్దు సారూ..!





పలమనేరు : నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, శాంతిపురం: ఫోన్లు అప్పగిస్తున్న అండన్‌వాడీలు

పలమనేరు: యాప్‌లతో వేగలేకున్నామని, తమకు ఇచ్చిన ఫోన్లతో ఆన్‌లైన్ సర్వేలు చేయడం వీలుకావడం లేదని పలమనేరు ఐసీడీఎస్ పరిధిలోని మూడు సంఘాలకు చెందిన అంగన్‌వాడీలు వాపోయారు. వారు సోమవారం తమ సెల్‌ఫోన్లను స్థానిక కార్యాలయంలోని అధికారికి అందజేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు వీఆర్ జ్యోతి మాట్లాడుతూ తమకు ఇచ్చిన ఫోన్లలో వివరాలను అప్‌లోడ్ చేయడం వీలుకావడం లేదన్నారు. అందుకే ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.

శాంతిపురంలో..

శాంతిపురం: ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో యాప్‌లు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ వర్కర్లు వాపోయారు. వారు తమకు అందజేసిన ఫోన్లు, ట్యాబ్‌లను సోమవారం సీడీపీవో కార్యాలయంలో అప్పగించారు. వారు మాట్లాడుతూ ఉన్న యాప్‌లను ఒక గొడుగు కిందికి తేవడం మాని కొత్తగా తెచ్చిన బెనిఫిషరీ పేస్ రికగ్నిజింగ్ యాప్‌తో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడంతో గంటల తరబడి ఫోన్లతో గడపాల్సి వస్తోందని వాపోయారు. అన్నింటినీ ఒకే యాప్‌లోకి తీసుకురావాలని డిమాండు చేశారు.

ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలను అందిస్తున్న సేవా సంస్థల ప్రతినిధులు

శాంతిపురం: పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న స్థానిక రైతులకు కర్ణాటకలోని ముళబాగిల్‌కు చెందిన ప్రకృతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సోమవారం ఉచితంగా మొక్కలు అందజేశారు. వరదేపల్లి వద్ద ఉన్న ఇరుగులమ్మ ఆలయ ప్రాంగణంలో పండ్ల తోటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఎండీ నారాయణప్ప మాట్లాడుతూ పర్యావరణ రక్షణతో పాటు రైతులకు ఆదాయం వచ్చేలా ఇన్ఫోసిస్, సే ట్రీ సంస్థల సహకారంతో మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. శాంతిపురం మండలంలో 500 ఎకరాల విస్తీర్ణానికి సరిపడా నాణ్యమైన పండ్లు, కలప మొక్కలను ఉచితంగా ఇస్తామన్నారు. మామిడి, కొబ్బరి, పనస, మహాగని, ఎర్రచందనం మొక్కలను రైతులకు ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు వాటి సంరక్షణపై తమ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఏడీ పల్లవి, సే ట్రస్ట్ సంస్థ ప్రతినిధి రష్మి, మండల ఉద్యానవన అధికారి వింధ్య, సేవా సంస్థ ప్రతినిధులు మురళీమోహన్, రామమూర్తి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

వి.కోట: పట్టణంలోని చౌడేపల్లి రోడ్డులో వున్న సత్యసాయి నగర్‌లో సోమవారం నాగాలమ్మ ఆలయ నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించారు. పురోహితులు వివిధ పూజలు, హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

9, 10 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ నేత నాగరాజు

పుంగనూరు: ఈ నెల 9, 10వ తేదీల్లో నగరిలో సీపీఐ 24వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, సహాయ కార్యదర్శి డాక్టర్ టి.జనార్దన్ తెలిపారు. వారు సోమవారం భగత్ సింగ్‌కాలనీలోని అయ్యలరాజు భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలను బలోపేతం చేయడంతోపాటు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించాయని, హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా కరెంటు చార్జీలు ఇష్టానుసారంగా పెంచేశారని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. నాయకులు కవిత, రామ్మూర్తి, మున్నా, పీవీరెడ్డి, కృష్ణ, రత్నమ్మ, మంజు, వెంకటేష్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్‌గా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. ఈ నెల 11లోపు స్థానిక కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పీజీ, యూజీ సెట్, ఏపీ సెట్ అర్హత సాధించిన అర్హులని, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

దక్షిణామూర్తి కుటుంబానికి పరామర్శ



దక్షిణామూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్య

పుంగనూరు: పెద్దపంజాణి మండలం మాదనపల్లెకు చెందిన మాజీ సర్పంచు, సీనియర్ కాంగ్రెస్ నేత పి.దక్షిణామూర్తి కుటుంబ సభ్యులను సోమవారం చిత్తూరు, అనంతపురం మాజీ ఎంపీలు ఎన్.రెడ్డెప్ప, తలారి రంగయ్య పరామర్శించారు. దక్షిణామూర్తి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మాదనపల్లెలోని స్వగృహంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీలు గ్రామానికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సతీమణి అరుణమ్మ, కుమారులు ప్రకాష్, కృష్ణమూర్తిని పరామర్శించారు. నాయకులు రాజగోపాల్, సీనియర్ న్యాయవాది బాలాజీ భాస్కర్ పాల్గొన్నారు.

మండలంలో భువనేశ్వరి మహాపీఠాధిపతి



కమలానంద భారతి స్వామికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పులిచెర్ల(కల్లూరు): హిందూ మత ప్రచారానికి ప్రతి ఒక హిందువూ ముందుకు రావాలని భువనేశ్వరి మహాపీఠాధిపతి కమలానంద భారతి స్వామి పిలుపునిచ్చారు. కమలానంద భారతి స్వామి రాష్ట్ర మంతటా హిందూ మత పాదయాత్ర చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం పులిచెర్ల మండలంలోని మంగళంపేట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి విచ్చేశారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులతో మాట్లాడుతూ హిందూ మతాన్ని పరి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుందన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మండల నాయకులు



వి.కోట: మండలంలో నూతనంగా పదవులు పొందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎంపీపీ యువరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిశారు. వారు మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామని తెలిపారు. పదవులు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యువరాజ్, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, ప్రచార ప్రధాన కార్యదర్శి వేణు ఆచారి, బీసీ సెల్ మంజునాథ్, ఎస్సీ సెల్ శివరాం, మండల మహిళ అధ్యక్షురాలు శశికళ కుమార్, జిల్లా బూత్ కమిటీ కార్యదర్శి మణి, పంచాయతీ కన్వీనర్ కుమార్, స్టూడెంట్‌వింగ్ శ్యామ్, కుమార్ రాజా, ప్రతాప్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

హామీల పేరుతో కూటమి ప్రభుత్వం దగా



సదుం: క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: మోసపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. మండలంలోని తిమ్మానాయనపల్లె, రెడ్డివారిపల్లె, చింతపర్తివారిపల్లె పంచాయతీల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అలవిగాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. ప్రజలు ఇక ఆయన మాటలు విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలుచేసే ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని ప్రజలు గుర్తించారని తెలియజేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారితో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి వారు మోసపోయిన విధానాన్ని వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు మురళీరెడ్డి, హనుమంత రెడ్డి, నాయకులు రామచంద్రయ్య, నారాయణ రెడ్డి, వాసు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న మాలమహానాడు సభ్యులు

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లికి చెందిన ఎరుకుల మంగమ్మ పొలం రికార్డులను తారుమారు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. ఆయన సోమవారం బాధితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు డబ్బుకు కక్కుర్తిపడి ఎరుకుల మంగమ్మ పొలానికి సంబంధించిన రికార్డులను వేరొకరి పేరుతో నమోదు చేశారని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ వారితో మాట్లాడారు. వారంలోగా విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండమనోహర్, యామల చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు అశోక్, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య, మండల శాఖ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు అధికారుల డుమ్మా

- మధ్యాహ్నం 12 గంటలు దాటినా తెరుచుకోని రైతు సేవా కేంద్రం
- కార్యాలయం వద్ద అర్జీదారుల పడిగాపులు



పెంగరగుంట రైతు సేవా కేంద్రం వద్ద అధికారుల కోసం వేచిచూస్తున్న అర్జీదారులు

పలమనేరు: సచివాలయాలు, ఆర్ఎస్‌కేల్లో ప్రతి సోమవారమూ గ్రీవెన్స్‌డేను నిర్వహించాలని, అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలమనేరు మండలంలోని పలు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో సోమవారం అధికారులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో అర్జీదారులు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. వారు అర్జీలను మళ్లీ కింది స్థాయి కార్యాలయాలకే పంపుతుండడం, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం గాక అర్జీదారులు విధిలేక జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

పెంగరగుంటలో ఇదీ పరిస్థితి

మండలంలోని పెంగరగుంట సచివాలయం, రైతు సేవా కేంద్రం వద్దకు సోమవారం మధ్యాహ్నం 12 గంటలైనా అధికారులు రాలేదు. అన్నదాత సుఖీభవ నిధులు పడకపోవడంతో అర్జీ ఇవ్వడానికి వచ్చిన సర్పంచ్ భర్త నక్షత్రయ్య, పలువురు రైతులు చాలాసేపు వేచి వుండి నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆపై కొందరు సిబ్బంది మాత్రం అందుబాటులోకి వచ్చారు. ఇదే పరిస్థితి అన్ని సచివాలయాలు, ఆర్ఎస్‌కేల్లో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.